వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం

- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- పంటమార్పిడితో లాభాలు
- ఒకే రకమైన పంట వేసి నష్ట పోవద్దంటున్న అధికారులు



వీవీరావుపేటలో విత్తనాలు వేస్తున్న రైతులు

మల్లాపూర్: తొలకరి చినుకులు మొదలైన తరుణంలో వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు ఆగ్రోస్, సింగిల్ విండో, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో రైతులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి పంపిణీ చేస్తున్నారు. కాగా మండల వ్యాప్తంగా ఈసారి పంటల సాగు గణనీయంగా పెరగనుంది. రైతులు ఒకే పంట వేసి నష్టపోకుండా రైతులు పంట మార్పిడి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో సాగు సాధారణ స్థాయి కంటే మరో 10 శాతం ఎక్కువగా పంట సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు.

అందుబాటు విత్తనాలు, ఎరువులు..

వానాకాలం సీజన్‌కు గాను వ్యవసాయశాఖ జీలుగ-1044 క్వింటాళ్లు, జనుము-250 క్వింటాళ్లు, వరి-2200 క్వింటాళ్లు, మొక్కజొన్న- 550 క్వింటాళ్లు, సోయాబీన్-180 క్వింటాళ్లు, పెసర్లు -10 క్వింటాళ్లు, కందులు-10 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా వానాకాలం సీజన్‌కు గాను యూరియా-250 టన్నులు, డీఏపీ-60 టన్నులు, కాంప్లెక్స్-145 టన్నులు, ఎంవోపీ-50 టన్నులను అందుబాటులోకి ఉంచుతున్నట్లు తెలిపారు. రైతుల డిమాండ్ మేరకు మరిన్ని ఎరువులు అందించేందుకు వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందని ఏవో లావణ్య తెలిపారు.

సాగు అంచనా వివరాలు..

వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలంలో వానాకాలం సీజన్‌కుగాను సాగు అంచనా వివరాలు ఇలా ఉన్నాయి. వరిపంట-21,000 ఎకరాలు, సోయాబీన్-300 ఎకరాలు, పసుపు-4500 ఎకరాలు, మొక్కజొన్న-7,500 ఎకరాలు, పెసర్లు-65 ఎకరాలు, కందులు-110 ఎకరాలు, చెరుకు-550 ఎకరాలు, మామిడి-2800, మిర్చి-950 ఎకరాలు, కూరగాయలు-340 ఎకరాలల్లో పంటలను సాగు చేసేందుకు అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు.

ఒకే రకమైన పంట సాగుతో నష్టం

ఒకే రకమైన పంటను వేయడంతో భూమి నిస్సారం అవుతుంది. చీడపీడలు ఎక్కువగా పంటను ఆశించి దిగుబడి తగ్గే అవకాశాలు ఎక్కువ. నీటి ఆధారిత పంటను ఎక్కువగా వేయడంతో నేలలో ఆమ్లత్వం పెరిగి, మరింత నష్టాన్ని చూడాల్సి వస్తుంది.

పంటల మార్పిడితో లాభాలు..

ఒకే రకమైన పంటను వేసి నష్టపోయే కంటే పంట మార్పిడి ద్వారా లాభదాయకమైన పంటలను సాగు చేసి అధిక దిగుబడిని సాధించవచ్చు. నేల సారవంతంగా అవుతుంది. పంట ఉత్పత్తి ధర ఎక్కువగా వచ్చే అవకాశాలు మెండు. నీటి వాడకం, ఎరువుల వాడకం తక్కువ. నష్టాల నుంచి లాభాలు పొందేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రైతులకు సూచనలిచ్చాం



వానాకాలం సీజన్ పంటల సాగుపై రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. భారీ వర్షాలు పడి భూమి నానేంత వరకు ఆరుతడి పంటలు వేసుకోవద్దని తెలిపాం. వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువులను ఆగ్రోస్, సింగిల్‌విండో, డీసీఎంస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. రైతులు సమాచారం కోసం వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి.

– లావణ్య, వ్యవసాయాధికారి,మల్లాపూర్

‘కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి’



కోరుట్లలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర చేస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కోరుట్లటౌన్: ముదిరాజ్ జాతికి ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ముదిరాజ్ మహాసభ కోరుట్ల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ముదిరాజ్ మహాసభ కోరుట్ల పట్టణ, మండల నాయకుల ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి కార్గిల్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు మాట్లాడుతూ ముదిరాజ్ జాతిపై కౌశిక్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేసి, మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పలేదన్నారు. అనుచిత వాఖ్యలు చేసి, అది ఫేక్ వీడియో అని నామమాత్రంగా క్షమాపణ కోరడం సరికాదని మండిపడ్డారు. హుజురాబాద్ చౌరస్తా లో బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ కోరుట్ల పట్టణ, మండల సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాయికల్ పట్టణంలో ముదిరాజ్ సంఘం నాయకులు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ వెంటనే ఆయనపై చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని చిన్నభూమయ్య, అన్నవేని వేణు, ప్రసాద్, నాగరాజు, అంజయ్య, శ్రీకాంత్, రంజిత్, రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ తన వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘చెరువు రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి’



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని లింగన్న చెరువు రోడ్డును కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులు తహసీల్దార్ రవీందర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామశివారులోని లింగన్న చెరువు రోడ్డును, మత్తడి కింద ఉన్న ఒర్రెను కబ్జా చేసి నీటి ప్రవాహానికి అడ్డంగా రాతి గోడను నిర్మించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మహిళలు పొదుపుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిక్షకులు

జగిత్యాలరూరల్: మహిళా సంఘ సభ్యులు పొదుపుపై దృష్టి పెట్టాలని మండల సెర్ప్ శిక్షకులు రమా, పావని అన్నారు. మంగళవారం మండల సెర్ప్ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్వశక్తి సంఘం సభ్యురాలు వారి ఆర్థిక పెరుగుదలకు, జీవన నాణ్యతకు పంచసూత్రాలు పాటించాలని, జీవితంలో క్రమం అవసరాల కోసం ఆర్థిక ప్రణాళిక తెలివిగా ఖర్చు చేయడం, తెలివిగా పొదుపుచేయడం, అవసరానికి రుణం తీసుకోవడం చేయాలన్నారు. బీమా, పెన్షన్ లాంటివి తీసుకుని కుటుంబ పరిరక్షణకు పాటుపడేలా ప్రణాళికలు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సమైక్య సభ్యులు భారతి, శ్రీలత, సుమలత, ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, గంగారాం, రవీందర్, సంతోష్, రాజేందర్, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మెట్‌పల్లి: ప్రతీ ఒక్కరు తరచుగా రక్తదానం చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ వేదవతి సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది రక్తదానం చేశారు. అంతకుముందు డీఎం మాట్లాడుతూ రక్తదానంపై అపోహతో ఉండవద్దని, తరచుగా రక్తం దానం చేయడం వల్ల కొత్త రకం వచ్చి ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో జ్యూస్ అందజేశారు. ఎస్బీఐ జీపీ సింగ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

కోరుట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోలో ఆర్టీసీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.రక్తదాతలకు యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి అన్నారు. డాక్టర్ బోగ శంకర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ ఎం.ఎల్.ఎస్ రెడ్డి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటేశం,మెకానికల్ ఫోర్‌మెన్ తిరుపతి,గంగారాం ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్



కోరుట్లలో ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంఈవో

జగిత్యాలజోన్: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పొన్న వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం, పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉంటూ, సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్లు చాణక్య, వినోద్, మల్లేష్, వెంకటేశ్వర్లు, శ్రీ లాల్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మల్యాల/ పెగడపల్లి: క్విజ్ పోటీలు విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెడుతాయని మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో లిటరసీ క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన కొడిమ్యాల మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ పాఠశాల, నమిలికొండ జిల్లా పరిషత్ పాఠశాల పెగడపల్లి మండలానికి చెందిన విద్యార్థులకు బహుమతుల అందించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ లాల్, పీడీ విశ్వ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. మల్యాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పెగడపల్లికి చెందిన శివ సాయి, కళ్యాణి పాల్గొని మూడో స్థానంలో నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందించిన రూ. 3 వేల నగదు పాటు ప్రశంసా పత్రాలను ఎంఈవో శ్రీనివాస్ అందజేసినట్లు హెచ్‌ఎం లచ్చయ్య తెలిపారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని ఐలాపూర్, నాగులపేట, జోగిన్‌పెల్లి, మోహన్‌రావుపేట, పైడిమడుగు, యూసుఫ్‌నగర్ గ్రామాల ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా మోహన్‌రావుపేట హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి విద్యార్థిని ఏ. వేదశ్రీ, తొమ్మిదో తరగతి విద్యార్థి డి. సాయిదీప్ ప్రథమస్థానంలో నిలిచారు. వీరికి మండల విద్యాధికారి గంగుల నరేశం ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, హెచ్‌ఎం లలిత, టీచర్లు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతీయ రిజర్వ్‌బ్యాంక్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా మండల స్థాయి క్విజ్ పోటీల్లో వర్షకొండ పాఠశాలకు చెందిన నితిన్, సామిత్‌లు ప్రథమ స్థానంలో గెలుపొందగా ఒకొక్కరికి రూ. 5వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మార్గం రాజేందర్, పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: అభివృద్ధిని చూసి ఓర్వలేకనే గత పాలకులు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.3.50 కోట్లతో 5,6,7,12 వార్డుల్లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయికల్ మున్సిపాలిటీలో ప్రతి వార్డులో సీసీరోడ్లు నిర్మించామని, పట్టణ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా దశల వారిగా చర్యలు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక గత పాలకులు విమర్శించడం వారికి అలవాటుగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో నిరుపేదల సంక్షేమం కోసం ఆసరా పింఛన్లు, రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు అన్వరిబేగం, ఎలిగేటి లతిక, మహేశ్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, యూత్ అధ్యక్షుడు మోర రాంమూర్తి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

జగిత్యాల: బక్రీద్ పండగను పురస్కరించుకుని పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గాను పరిశీలించారు. రాష్ట్రంలో అన్ని మతాల ముఖ్య పండగలను గొప్పగా జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్ పాల్గొన్నారు. పట్టణంలోని 31వ వార్డుకు చెందిన పర్వీన్ సుల్తానాకు షాదీముబారక్ కింద రూ.లక్ష మంజూరు కాగా ఎమ్మెల్యే అందజేశారు.

భవనానికి నిధులు కేటాయించాలి

జిల్లా కేంద్రంలో గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ సంఘ భవనానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజయ్యగౌడ్, సత్యనారాయణ, మల్లేశం, శ్రీనివాస్, సత్తయ్య నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులు పఠనోత్సవంపై దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అనుపమ

మల్లాపూర్: విద్యార్థులు పఠనోత్సవంపై ప్రత్యేక దృష్టి సారించాలని గర్ల్‌చైల్డ్ డెవలప్మెంట్ అధికారి అనుపమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల పఠనాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. ఈ నెల 31వరకు పఠనోత్సవం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ మహేశ్, ఇన్‌చార్జి ఎస్‌వో కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌యాత్ర ప్రారంభం



యాత్ర ప్రారంభిస్తున్న వేద పండితులు

జగిత్యాల: శ్రీనిఖిల్ చేతన భక్త బృందం పులిమామిడి సైకిల్‌యాత్రలో భాగంగా మంగళవారం లక్ష్మీ గణేశ్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పులిమామిడి వరకు సైకిల్‌యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ జగిత్యాల నుంచి పులిమామిడి, హైదరాబాద్ శ్రీనిఖిల్ చేతన కేంద్రం వరకు జగిత్యాల భక్తబృందం సైకిల్‌యాత్ర ఆషాఢమాసంలో జులై 3న గురుపౌర్ణమి సందర్భంగా అక్కడకు చేరుకుంటుందని తెలిపారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వస్తారని, జులై 3న జరిగే హోమంలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత

కొండగట్టు: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన లైశెట్టి వెంకటేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా మృతుడు పోస్ట్ ఆఫీస్ బీమా పథకం తీసుకోవడంతో కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు సర్పంచ్ రాధ, పోస్టర్ సూపరింటెండెంట్ కిరణ్‌రెడ్డి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ తోర్తి రాజేశ్, రేవతి శ్రీనివాస్ షబ్బీర్ వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

మెట్‌పల్లి: పట్టణంలోని దీన్‌దయాళ్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానిక నితిన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సౌండ్ సిస్టంను వితరణ చేశారు. డాక్టర్ ఆనంద్‌బాబు చేతుల మీదుగా సౌండ్ సిస్టంతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాహేర్, ఉపాధ్యాయులు సరిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్, ఫకీర్ కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు మెట్‌పల్లికి చెందిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్‌ను అందచేశారు.కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గెదే మృతి

మల్లాపూర్: మండల కేంద్రంలో మంగళవారం విద్యుత్ ఘాతానికి గురై గెదే మృతి చెందింది. గ్రామానికి చెందిన వేములవాడ చంద్రయ్య తన గెదేను రోజు మాదిరిగానే మేతకు పంపించగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందింది. రూ.70 వేల నష్టం జరిగిందని, అధికారులు స్పందించి బాధితుడిని ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు.

ధర్మపురి చేరిన స్వామిజీ పాదయాత్ర

ధర్మపురి: ధర్మరక్షణ కోసం పాదయాత్ర చేస్తూ ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రానికి మంగళవారం రాత్రి చేరుకున్న చింత రమేశ్ స్వామిజీకి నాయకులు ఆహ్వానం పలికారు. నిజామాబాద్ జిల్లా వెల్మల్ మండలంలోని కౌలుపూర్ నుంచి శ్రీశ్రీశ్రీ పరమహంస భూమా యోగీశ్వరుల ఆశ్రమం (శక్తి పీఠం)కు చెందిన చింత రమేశ్ స్వామిజీ ధర్మరక్షణ కోసం పాదయాత్ర చేస్తూ ధర్మపురికి చేరుకున్నారు. విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో స్వామిజీకి ఆహ్వానం పలికి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంగి నర్సయ్య, గాజు భాస్కర్, పిల్లి శ్రీనివాస్, రంగు లక్ష్మినరహరి, బండారు లక్ష్మణ్ తదితరులున్నారు.

ధర్మపురికి నేడు సరస్వతీ స్వామిజీ రాక

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి తొగుట ఆశ్రమానికి చెందిన శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామిజీ బుధవారం సాయంత్రం రానున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. స్వామిజీ రాక సందర్భంగా నంది కూడలి నుంచి దేవాలయం వరకు మేళతాళాలు మంగళవాయిద్యాలతో స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారని ఈవో పేర్కొన్నారు.

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన నాయకులు

రాయికల్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బూత్‌స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని మంగళవారం రాయికల్ పట్టణంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డితో కలిసి వీక్షించినట్లు పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మపురి: పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఇంటర్ పూర్తయిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. బీఏ (ఈపీహెచ్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం (బిజినెస్ అప్లికేషన్స్), బీఎస్సీ (ఎంపీసీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌డీఎస్), (ఎంఎస్‌సిఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ) మొదలగు కోర్సుల్లో సీట్లకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 8019429413 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నియామకం

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా టీవీ శేఖర్

కోరుట్ల: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు టీవీ శేఖర్ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీవీ శేఖర్ మాట్లాడుతూ పట్టణంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడతానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా తాజుద్దీన్

జగిత్యాలటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ జగిత్యాల పట్టణ ఉపాధ్యక్షుడిగా మైనార్టీ నాయకుడు మహ్మద్ తాజుద్దీన్‌ను నియమించారు. ఈ సందర్భంగా తాజ్ మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ ఆసీఫ్, బీఆర్‌ఎస్ నాయకులు అల్లాల ఆనందరావు, వొల్లం మల్లేశం, దుమాల రాజ్‌కుమార్, జహంగీర్ ఉన్నారు.


ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం

సారంగాపూర్: మన పూర్వీకుల నుంచి ఉమ్మడి కుటుంబాలే బలంగా ఉండేవని, దీని విలువలను మన పిల్లలకు నేర్పాలని సామాజిక సమరసతా హిందు సంఘటన తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని రేచపల్లిలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మన పూర్వీకులు కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో ఆదర్శంగా నిలిచేవారన్నారు. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కనిపించడం లేదని, ఉమ్మడి కుటుంబాల విలువను మన పిల్లలకు, వచ్చే తరానికి తెలపాలని కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని ప్రాంత బాధ్యులు రుద్రోజు శ్రీనివాస్, వొద్దిపర్తి పెద్ద సంతోషాచార్యులు, ఆకుల పోచన్న, వేముల సంతోష్, శంకర్, చక్రం రాజు పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

కథలాపూర్: రైతులకు వందశాతం రాయితీపై కంది విత్తనాలు అందిస్తున్నామని, ఆసక్తిగల రైతులు తీసుకెళ్లాలని కథలాపూర్ ఏవో యోగితా మంగళవారం తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు ఏఈవోలకు అందించాలని ఏవో పేర్కొన్నారు.

రోడ్డుపై గుంత.. ప్రయాణికులకు చింత..



యూనియన్ బ్యాంక్ వద్ద రోడ్డుపై గుంత

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ముందు రోడ్డుపై పెద్ద గుంత పడటంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడటం వలన గుంతలో నిండుగా నీళ్ల నిలవడంతో గుంత ఏర్పడక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పడ్డ గుంతను పూడ్చి వేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.